

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
8 పేజీలు | మంగళవారం | నవంబర్ 7, 2023 | www.navatelangana.com



రాజ్యాంగ రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలి

- లాల్ నీల్ మైత్రి పుస్తకావిష్కరణ సభలో వక్తల పిలుపు

2లో...



కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి

- రూ.5కోట్ల ఇసుక దందాలో బాల్క సుమన్ వాటా రూ.2వేల కోట్లు
- చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్

8లో...

కలయిక కాంగ్రెస్‌కు కలిసొచ్చేనా..?

- ప్రేంసాగర్‌రావు ఇంటికి వినోద్, వివేక్
- జిల్లాలో కాంగ్రెస్ గెలుపుకు వ్యూహరచన
- ముగ్గురి కలయికతో కాంగ్రెస్‌కు మరింత బూస్ట్
- మూడు నియోజకవర్గాల్లో జోరందుకున్న చేరికలు

వివరాలు..2లో... నవతెలంగాణ - హాజీపూర్



మొన్నటిదాకా ఎడమొహం పెడమొహంల ఉన్న కాంగ్రెస్ నాయకులు ప్రేంసాగర్‌రావు, గడ్డం బ్రదర్స్ సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రేంసాగర్‌రావు నివాసంలో కలుసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. గతంలో ఉప్పు నిప్పులా ఉన్న వీరు ఇప్పుడు కలవడంతో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపుతోంది. ఒకప్పుడు వీరు ముగ్గురు ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. టికెట్ల విషయంలో కూడా ఒకరికి మించి ఒకరు రాకుండా కూడా ప్రయత్నాలు చేశారు. సడన్‌గా ప్రేంసాగర్‌రావు ఇంట్లో వీరు ముగ్గురు కలుసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లాలో కాంగ్రెస్ గెలుపుకు ముగ్గురం కలిసి పథక రచన చేస్తున్నామని చెప్పడంతో రాజకీయంగా కీలక మలుపు తిరిగిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కాంగ్రెస్‌కు మూకుమ్మడి రాజీనామాలు..!

- కంటతడి పెట్టిన ఆదిలాబాద్ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్
- ఇండిపెండెంట్‌గా పోటీకి సిద్ధం
- చెన్నూర్‌లో పార్టీని వీడిన బోడ జనార్ధన్, డాక్టర్ రాజారమేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్, జైపూర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి మంటలు చల్లారడం లేదు. ఆదిలాబాద్, చెన్నూర్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ సీనియర్ నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. ఆదిలాబాద్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడారు. ముగ్గురిలో ఎవరికి టికెట్ ఇచ్చిన కలిసి పని చేస్తామని అధిష్టానానికి మొదటి నుండి చెబుతూ వచ్చారు. కానీ అధిష్టానం వీరిని కాదని కంది శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఖరారు చేయడంతో అసమ్మతి రాజుకుంది. పార్టీకైనా రాజీనామా చేస్తాం కానీ ఆయనకు మద్దతు ఇవ్వమని పట్టుబట్టారు. చివరకు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తూన్నట్లు ముగ్గురూ ప్రకటించారు. వీరితో పాటు ఓబీసీ జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ అంబకంటి అశోక్, కేఆర్కే కౌన్సిలర్ రేష్మ ముబారక్, ఆదిలాబాద్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటి,


రాజీనామా పత్రాలు చూపిస్తున్న ఆదిలాబాద్ కాంగ్రెస్ నాయకులు

మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు సుమారుగా 30 నుండి 35 మంది వరకు మూకుమ్మడి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి నివాసంలో మీడియా సమావేశంలో వెల్లడించారు.

20ఏండ్ల అనుబంధాన్ని తెంచుకుంటున్న..

జీవితం మొత్తం పార్టీకి అంకితం మిగతా..2లో...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో

15 నామినేషన్లు

నవతెలంగాణ-విలేకరులు

నామినేషన్ల ప్రక్రియ భాగంగా సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 15 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 4 నామినేషన్లు దాఖలయ్యాయి. బీజేపీ నుండి పాయల శంకర్, యుగ తులసీ పార్టీ నుండి సురేష్, స్వతంత్ర అభ్యర్థులుగా గైపెల్లి నాగన్న, సత్యనారాయణ నామినేషన్లు దాఖలు చేశారు. బోథ్ నుండి బీఆర్ఎస్ అభ్యర్థిగా అనిల్ జాదవ్ నామినేషన్ వేశారు. ఖానాపూర్ నుండి స్వతంత్ర అభ్యర్థిగా నేతావత్ రాజేందర్ నామినేషన్ దాఖలు చేశారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా రాంటెంకి శ్రీనివాస్ మిగతా..2లో...


నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న అనిల్ జాదవ్

ఆదివాసుల అభ్యున్నతికే రాజకీయాల్లోకి..!

- విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు
- వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రస్తుతం ఆధునిక యుగంలో ప్రపంచం ఎంతో ముందుకు సాగుతోంది. కానీ ఆదివాసుల స్థితిగతులు మారడం లేదు. వారి అభ్యున్నతికి రాజకీయాల్లోకి వచ్చినట్లు ఖానాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. ప్రధాన రాజకీయ పార్టీ అయిన కాంగ్రెస్ నుండి ఎన్నికల బరిలో ఉన్న ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. సమస్యలను చూసి ఆదివాసీ విద్యార్థి సంఘంలో చేరి విద్యార్థి దశ నుండే ఉద్యమాలు చేశానని తెలిపారు. సాంకేతికంగా ప్రపంచం దూసుకెళ్తోందని, కానీ ఆదివాసీ గిరిజనులు మాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. ప్రభుత్వాలు మారిన వారి జీవితాలు మారలేదన్నారు. రాజకీయంగా వారి తరపున ప్రాతినిధ్యం వహించేందుకు కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా పోటీకి దిగినట్లు తెలిపారు. రాష్ట్రంలో మిగతా..2లో...



నవతెలంగాణ

రాజ్యాంగ రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలి

● లాల్ నీల్ మైత్రి పుస్తకావిష్కరణ సభలో వక్తల పిలుపు

నవతెలంగాణ-మంచిర్యాల

మనువాద మతోన్మాద శక్తుల నుండి దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కోసం అభ్యుదయకర శక్తులన్నీ ఐక్యతతో పోరాటం కొనసాగించాలని నాగార్జున విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ బాషా పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాలలో జరిగిన లాల్ నీల్ మైత్రి పుస్తక ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. వామపక్ష బహుజన శక్తుల మధ్య అనైక్యత కారణంగా దేశంలో మతోన్మాద శక్తులు పెట్రేగిపోతున్నాయని తెలిపారు. సామాన్య ప్రజల హక్కులను నిలబెట్టిన గొప్ప చారిత్రక పత్రంగా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం నిలిచిపోతుందని పేర్కొన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం నేడు మనువాదుల నుండి దాడిని ఎదుర్కొంటోందని ఆయన హెచ్చరించారు. మతోన్మాద శక్తులు చట్టసభలలో సైతం బలాన్ని సంతరించుకుని రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని జులుం ప్రదర్శిస్తున్నాయని తెలిపారు. మనువాదుల కుట్రలు ఫలించి మనుస్మృతి కొత్త రాజ్యాంగంగా మారితే దేశంలో 90శాతం మెజార్టీ వర్గాల హక్కులు రద్దవుతాయని ఆయన హెచ్చరించారు. విభేదాలను విస్మరించి మనువాద మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా అంబేద్కరిస్టులు, వామపక్ష శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన హితవు పలికారు. లాల్ నీల్ ఐక్యవేదిక నాయకులు రేఖా చంద్రశేఖర్‌రావు ప్రసంగిస్తూ 70 ఏళ్ల క్రితమే రామ చంద్రమోరె అంబేద్కర్ కలిసి ఐక్యతతో ఉద్యమించారని, ఆ తోవలో నేటికాలపు ప్రగతిశీల శక్తులు పయనించాలని పేర్కొన్నారు. 'మార్క్సు అంబేద్కర్లు మన మార్గదర్శకులు' అనే పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు జి. రాములు, సీపీఐ(ఎంఎల్ న్యూడెమోక్రసీ) రాష్ట్ర నాయకులు టి.శ్రీనివాస్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు కాదాసి రవీందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు లాల్ కుమార్, జయరావు, కనుకుంట్ల మల్లయ్య, మంగ, పలిగిరి కనకరాజు, రంగు రాజేశం, వడ్డేపల్లి మనోహర్, ప్రకాష్, రంజిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

● ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లో శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. సోమవారం ఆసిఫాబాద్ ఆర్డీఓ సురేష్‌తో కలిపి శాసనసభ ఎన్నికలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచార సభలు, ర్యాలీలు, సమావేశాలు, వాహనాలు, ప్రకటనల కొరకు సంబంధిత అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఐదు కిలోమీటర్ల కంటే దూరంగా ఉన్న ఓటర్ల కొరకు అదనపు పోలింగ్ కేంద్రాల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని తిర్యాణి మండలం మందగూడ పోలింగ్ కేంద్రం నుండి బుగ్గగూడ, భీంజిగూడ, తాటి మాదర హాబిటేషన్లతో కలిపి బుగ్గగూడ పోలింగ్ కేంద్రం ఏర్పాటు, సిర్పూర్ నియోజకవర్గంలో సిర్పూర్(టి) మండలంలోని హుడ్కిలి పోలింగ్ కేంద్రం నుండి ఇటిక్యాల పహాడ్ గ్రామాన్ని తొలగించి ఇటిక్యాల్ పహాడ్ గ్రామంలో అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు కొరకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలని, నామినేషన్ దాఖలు చేసే సమయంలో నామినేషన్ల స్వీకరణ కేంద్రానికి 100 మీటర్ల లోపు నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో కలిపి 5గురికి అనుమతి ఉంటుందని తెలిపారు. మొత్తం 3 వాహనాలను అనుమతిస్తామన్నారు. ఒక్కో అభ్యర్థి 4సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చుని, అత్యధికంగా 2ప్రాంతాలలో పోటీ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

15 నామినేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్ దాఖలు చేశారు. మంచిర్యాలలో స్వతంత్ర అభ్యర్థులుగా గవ్వల శ్రీకాంత్, రంగు మల్లేశం, ఆమ్ ఆద్మీ పార్టీ నుండి ఎండీ నయీంపాషా నామినేషన్లు దాఖలు చేశారు. నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు నామినేషన్ దాఖలు చేశారు. ముధోల్ నుండి బీజేపీ అభ్యర్థి పవార్ రామారావు పటేల్ నామినేషన్ వేశారు. సిర్పూర్(టి) నుండి బీజేపీ అభ్యర్థిగా పాల్వాయి హరీష్‌బాబు నామినేషన్ వేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో బీజేపీ నుండి జుమ్మిడి రాజేష్, స్వతంత్ర అభ్యర్థిగా చకినారపు కిరణ్ నామినేషన్లు దాఖలు చేశారు.



కలయిక కాంగ్రెస్‌కు కలిసొచ్చేనా..?

నవతెలంగాణ - హాజీపూర్

జిల్లా కాంగ్రెస్‌లో జోష్ నింపిన ఘటన సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రేంసాగర్‌రావు నివాసం వేదికగా చోటు చేసుకుంది. ఏండ్ల తరబడి కాంగ్రెస్ పార్టీలో మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు, మాజీ మంత్రి గడ్డం వినోద్ మధ్య పచ్చి గడ్డి వేస్తే భగ్గుమనేలా రాజకీయం నడిచింది. కాంగ్రెస్ నుండి గెలిచిన మాజీ ఎంపీ గడ్డం వినోద్ తెలంగాణ సాధనలో క్రియాశీలంగా ఉంటూ రాష్ట్ర సాధన కోసం సొంత పార్టీపైనే తిరుబావుటా ఎగరేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ కురువృద్ధులు స్వరాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన గడ్డం వెంకటస్వామి తనయులైన వినోద్, వివేక్ కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా ఉండేవారు. తెలంగాణ వచ్చిన అనంతరం వివేక్ బీఆర్ఎస్‌లో చేరారు. వినోద్ కాంగ్రెస్‌లోనే ఉండి పోయారు. అప్పటి నుండి జిల్లా కాంగ్రెస్‌లో వినోద్, ప్రేంసాగర్‌రావు మధ్య ఆధిపత్య పోరు నడిచింది. ఒకే పార్టీలో ఉంటూ బాహాటంగానే ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. 2014లో బీఆర్ఎస్ అధిష్టానం పెద్దపల్లి ఎంపీ టికెట్ వివేక్‌కు కేటాయించకుండా బాల్క సుమన్‌కు ఇవ్వడంతో వివేక్ కాంగ్రెస్‌లో చేరి ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తర్వాత బీజేపీలో చేరారు. ఇటీవల తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రేవంత్‌రెడ్డి ఆహ్వానంతో రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచారు.

కేసుల దాకా పోయి..చల్లబడి

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు, మాజీ మంత్రి గడ్డం వినోద్ మధ్య విభేదాలు తారా స్థాయిలో ఉండేవి. ఒకరిపై ఒకరు బాహాటంగానే విమర్శలు చేసుకున్న ఘటనలు ఉన్నాయి. మూడు నెలల క్రితం తనకు ప్రేంసాగర్‌రావు రూ.18లక్షలు ఇవ్వాలని, పలుమార్లు అడిగినా ఇవ్వకపోవడంతో చెక్ బౌన్స్ కేసు వేయాల్సి వచ్చిందని వినోద్ ప్రెస్‌మీట్‌లో తెలిపారు. అప్పుడది సంచలనం అయింది. వినోద్ స్థానికుడు కాదు, తండ్రి వెంకటస్వామి(కాక) కూడా స్థానికుడు కాదు వినోద్‌కు బెల్లంపల్లి టికెట్ ఇవ్వొద్దని, ఇచ్చినా తాను అడ్డుకుంటానని ప్రేంసాగర్‌రావు పలు సందర్భాల్లో చెప్పారు. వివేక్ కూడా గతంలో ప్రేంసాగర్‌రావు గూండా అని, పేకాట ఆడిస్తూ కోట్లు సంపాదించాడని, బేగంపేట్‌లోని చిరన్ ఫోర్ట్ క్లబ్‌ను కబ్జా చేశారని విమర్శించారు. వీరి మధ్య ఇంతలా వైరం ఉండగా ప్రస్తుతం సయోధ్య కుదరడం కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నిండింది.

మూడు నియోజకవర్గాల్లో ప్రభావం

ప్రేంసాగర్‌రావు, గడ్డం బ్రదర్స్ కలవడంతో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ప్రభావం చూపనుంది. ముగ్గురు గతం నుండి పట్టున్న నాయకులు కావడంతో ఒకరి నియోజకవర్గంలో ఒకరికి సహకారం అందనుంది. చెన్నూర్ నుండి గెలిచి మంత్రి అయిన వినోద్‌కు బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో అనుచరులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావుకు బెల్లంపల్లి, చెన్నూర్‌లో బలమైన అనుచరగణం ఉంది. ఎంపీగా చేసిన వివేక్‌కు కూడా బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాలలో భారీగా అనుచరులు ఉన్నారు. అందుకనే ఒకరికి ఒకరు సాయం చేసుకుంటేనే గెలుపుకు బాటలు పడతాయని పలువురు పేర్కొంటున్నారు. గడ్డం వివేక్ మధ్యవర్తిత్వం వహించడంతోనే ముగ్గురూ ఒక్క తాటి పైకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం మూడు నియోజకవర్గాల్లో ఇతర పార్టీల నుండి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. దీంతో బీఆర్ఎస్‌లో అలజడి మొదలైంది. మొన్నటి వరకు కాంగ్రెస్‌కు ఆ పార్టీలోనే శత్రువులున్నారని విమర్శించిన అధికార పార్టీ ఇప్పుడు డైలామాలో పడింది. వేరే విమర్శనాస్త్రాల కోసం ప్రణాళిక సిద్ధం చేసే పనిలో పడ్డారు.

కాంగ్రెస్‌కు మూకుమ్మడి రాజీనామాలు

(మొదటి పేజీ తరువాయి)

చేశానని, ఇప్పుడు రాజీనామా చేస్తున్నానని చెప్పడానికి కూడా నోరు రావడం లేదంటూ సాజిద్‌ఖాన్ కంటతడి పెట్టుకున్నారు. పార్టీని వీడాలంటే బాధగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డి టీడీపీ నుంచి వచ్చిన వారితో పాటు ఆర్ఎస్ఎస్ నాయకులకు టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ జెండా మోసిన తమకు కాకుండా ఇతరులకు డబ్బులతో టికెట్ అమ్ముకున్నారని ఆరోపించారు. టికెట్ రాకున్నా ఇండిపెండెంట్‌గా బరిలో ఉండి గెలిచాక మళ్లీ కాంగ్రెస్‌లో చేరుతామని పేర్కొన్నారు. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా సంజీవ్‌రెడ్డిని నిలపాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని నమ్ముతానని చెప్పిన వ్యక్తికి టికెట్ కేటాయించడం సరికాదని గంద్రత్ సుజాత తీవ్ర స్థాయిలో రేవంత్‌రెడ్డిపై ఫైర్ అయ్యారు. పార్టీ కోసం పని చేస్తే తడి బట్టలతో గొంతు కోశారని పేర్కొన్నారు. ముగ్గురం చివరి వరకు టికెట్ కోసం చాలా ప్రయత్నాలు చేశామని, అయినప్పటికీ అధిష్టానం కందికే టికెట్ ఇచ్చిందని సంజీవ్‌రెడ్డి మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న వ్యక్తికి టికెట్ ఇస్తే తాము కలిసి పని చేయమని అధిష్టానానికి ఆఖరి వరకు విన్నవించామన్నారు. తాను ఇండిపెండెంట్‌గా ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని, 10న నామినేషన్ వేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.





కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్

చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బోడ జనార్ధన్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. పార్టీ బలోపేతం కోసం శ్రమించిన స్థానికులను కాదని స్థానికేతరుడు, కార్పొరేట్ వ్యాపారస్తుడు వివేక్ వెంకటస్వామికి టికెట్ కేటాయించినందుకు నిరసనగా పార్టీ సభ్యత్వానికి రాజీనామ చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి పంపిస్తున్నట్లు తెలిపారు. సహచరుల అభీష్టం మేరకు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వెల్లడించారు. మందమర్రి పర్యటనకు వస్తున్న పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరడంతో పాటు చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ గెలుపుకు కృషి చేస్తానని తెలిపారు. తనతో పాటు మరో 13 మందిని పక్కన పెట్టి కొత్తగా పార్టీలో చేరిన వివేక్ వెంకటస్వామికి టికెట్ కట్టబెట్టడం బాధాకరమని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాజారమేష్ అన్నారు. స్థానికంగా పార్టీని బలోపేతం చేయడం కోసం శ్రమించిన వారిని పక్కన పెట్టి డబ్బులున్న వ్యక్తికి టికెట్ ఇవ్వాలని పార్టీ తీసుకున్న నిర్ణయంతో కలత చెందానని పేర్కొన్నారు. డాక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పార్టీ బలోపేతం కోసం శ్రమించి తీరు, ఆర్థికంగా నష్టపోయిన విషయాన్ని పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి పంపిన రాజీనామాలో వివరించినట్లు తెలిపారు.

ఆదివాసుల అభ్యున్నతికే రాజకీయాల్లోకి..!

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేండ్లు పూర్తయినా ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే గిరిజనుల ఉన్నత విద్య కోసం ఉమ్మడి జిల్లాలోని ఉట్నూర్ కేంద్రంగా గిరిజన యూనివర్శిటి ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. జోడేఘాట్‌కు వచ్చిన సీఎం కేసీఆర్ కుమురంభీం సాక్షిగా ఉట్నూర్‌లో గిరిజన యూనివర్శిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. బీఆర్ఎస్ మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కి ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఖానాపూర్, కడెం, ఉట్నూర్ మండలాలు మినహా ఇంకెక్కడ డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం పహాణీలు ఇచ్చి బ్యాంకు రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేలా కృషి చేస్తానన్నారు. ఉట్నూర్, ఖానాపూర్, జన్నారం ఆస్పత్రులను వంద పడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేసి వైద్యుల నియామకం చేపడతామని పేర్కొన్నారు. ఖానాపూర్, జన్నారంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఖానాపూర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ఖానాపూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. గిరిజన గ్రామాలకు రోడ్లు, మంచినీరు, కరెంట్ తదితర సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఖానాపూర్ నియోజకవర్గం అత్యంత వెనుకబడిన, షెడ్యూల్ ప్రాంతం అయినందున కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే విద్య, వైద్యం, వ్యవసాయం తదితర రంగాల అభివృద్ధిపై దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. కడెం ప్రాజెక్టు, సదర్‌మాట్ బ్యారేజీ ద్వారా పూర్తి స్థాయి ఆయకట్టుకు సాగు నీరందిస్తామని హామీ ఇచ్చారు.

నవతెలంగాణ
నిర్మల్
మంగళవారం నవంబర్ 07, 2023

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-కడెం

మండలంలోని ఎల్లగడప గ్రామానికి చెందిన సయ్యద్ మొయిసోద్దీన్, మండల కేంద్రానికి చెందిన సయ్యద్ మీనాజ్ ఉస్సన్ మరణించగా, విషయం తెలిసిన బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ సోమవారం ఉదయం వారి ఇంటికి వెళ్లి వారి భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి ప్రచారం



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని డోడార్నా, సాయినగర్, రామనాయక్ తండా, ధావుజి నాయక్ తండా, మోహన్ నాయక్ తండా, కిషన్ నాయక్ తండా, మల్లేశ్వర్ తండాలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్‌లతో పాటు మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్ ప్రచారం చేశారు. ముధోల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డిని గెలిపించాలని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం రూ.16వేలు, రైతు భీమా తదితర నూతన పథకాలు ప్రజలకు అందేలా తోడపడుతుందని అన్నారు. ఇప్పటికే కొన్ని రాజకీయ పార్టీలు ప్రజలకు మభ్యపెట్టి ప్రజలను మోసం చేసే ప్రయోగాలు చేస్తున్నాయని అన్నారు. వారి మాటలను నమ్మిమోసపోకుండా బీఆర్ఎస్ అభ్యర్థి విఠల్ రెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు ఉన్నారు.

ఆత్మీయ వీడ్కోలు సమ్మేళన సమావేశం



నవతెలంగాణ-నిర్మల్

ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీల్లో జిల్లా పరిషత్ మంజులాపూర్ పాఠశాల నుంచి వెళ్లిన 9 మంది ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ఆత్మీయ సమ్మేళనం, సన్మాన కార్యక్రమం సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా పాఠశాలలో ఎన్నో వినూత్న కార్యక్రమాలు ఏర్పాటు చేసి విద్యార్థులను తీర్చిదిద్దామని అన్నారు. ఉపాధ్యాయులను సాధారణంగా సన్మానించిడం సంతోషంగా ఉందని అన్నారు. గతంలో విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంలో ఎంతో కృషి చేశారన్నారు. విద్యార్థుల నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మెన్ గోవర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడలో సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ భోజరాం పటేల్, మాజీ జెడ్పీ చైర్మెన్ జుట్టు అశోక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తలు పకడ్బందీ ప్రణాళికతో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గ యూత్ ఇన్‌చార్జి నాకిడి నవీన్, మండల ఉపాధ్యక్షులు సలీం, నాయకులు నాకిడి లక్ష్మణ్, గంగామణి, గజేందర్, నాగరావు పటేల్, కండెల ముత్యం, భోజు, మ్యాతరి లక్ష్మణ్, కాల్వగడ్డ పెద్ద రాజేశ్వర్, నీరటి శంకర్, లస్మన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

● బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కనకపూర్, వడ్యాల, పీచర, ధర్మారం, పార్పెల్లి, మల్లాపూర్, మునిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు పట్టాం కట్టాలన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రతీ ఒక్కరూ ఓటు వేసి బాసటగా నిలవాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీఎం కేసీఆర్ విడుదల చేసిన బీఆర్ఎస్ మేనిఫెస్టో అద్భుతంగా ఉందని తెలిపారు. సబ్బండ వర్గాలకు కొండంత అండగా కలిగించేలా మేనిఫెస్టో ఉందని తెలిపారు. ప్రస్తుతం కొనసాగిస్తున్న పలు పథకాల పరిధిని పెంచేలా, లబ్ధిదారులకు మరింత మేలు జరిగేలా పలు అంశాలను మేనిఫెస్టోలో పొందుపర్చినట్లు ప్రజలకు వివరించారు. జిల్లా కేంద్రం ఏర్పాటుతో పాటు, మెడికల్ కాలేజీ తీసుకొచ్చామని వివరించారు. సంపదను పెంచుతూ ప్రజలకు పంచుతున్నామని, ప్రస్తుత పథకాలను అన్నింటిని కొనసాగిస్తూనే, తాజా మేనిఫెస్టోలో అన్ని అంశాలను అమలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం గొప్ప విషయమన్నారు. రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా పథకాలతో రైతులందరూ బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, రైతుబంధు మరోసారి పెంచుతామని హామినివ్వడం గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు. దీని వల్ల రైతులకు మరింత మేలు జరుగుతుందని, రైతులను నుంచి మంచి స్పందన వస్తుందని కేసీఆర్‌కే మా మద్దతు అని చెబుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునందన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేష్, మండల కన్వీనర్ కోరిపెల్లి కృష్ణారెడ్డి, మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, శాతం బొర్రవ్వ, గంగారాం, కుర్మా రాజేందర్, బుర్రి లత, భూమేష్, అర్జున్‌రెడ్డి, మేకల రాజేందర్ యాదవ్, బూసి రమ, బూసి ముత్యం, కేశం రమేష్, సంగం వెంకట్‌రాజ్, సత్య నారాయణ, పడిగెల గంగాధర్, ఉల్వాజీ రాజు, గుజ్జరి గణేష్, పోతుగంటి రమేష్ కుమార్, రవీందర్, చిన్నారెడ్డి, సాయన్న, భూమారెడ్డి, సురేష్, సురేష్‌రెడ్డి, కల్లెడ భూమన్న, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మధ్యాహ్నా భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్

నవతెలంగాణ-ఖానాపూర్

మధ్యాహ్నా భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. సోమవారం ఖానాపూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్నా భోజన పథకం కార్మికుల నియోజకవర్గ స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నా భోజన పథకం కొత్త మెనూను సవరించాలని అన్నారు. ముఖ్యమంత్రి అల్పాహారం పనికి అదనం వేతనం సంబంధించిన బడ్జెట్ కేటాయించి అమలు చేయాలని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తుందని రెండు సంవత్సరాలుగా పెంచిన వేతనాలు ఇవ్వకపోవడం సరైంది కాదని అన్నారు. మధ్యాహ్నా భోజన కార్మికులు ఈ జిల్లాలో ప్రభుత్వానికి రూ.9 కోట్ల అప్పులు పెట్టారని అధిక అప్పులు చేసి ఉన్న ఆస్తులు తాకట్టు పెట్టి మధ్యాహ్నా భోజన పిల్లలకు వంటలు చేసి పెడుతున్నారని అన్నారు. ఎప్పుడు బిల్లులు అడిగినా, ఎప్పుడు వేతనాలు అడిగినా అనవసరమైన సాకులు చెబుతూ నెలలుగా పెండింగ్ పెడుతూ మధ్యాహ్నాం భోజన కార్మికులను మరింత అప్పుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నా భోజన కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఒకే కలర్‌తో కూడిన కాటన్ బట్టలు యూనిఫామ్‌గా ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రమాదబీమా ఐదు లక్షల ఇవ్వాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఈ సమస్యలను పరిష్కారం చేయాలని, లేని పక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నా భోజన యూనియన్ జిల్లా కార్యదర్శి రాధ, మండల అధ్యక్షురాలు లక్ష్మి, విజయ, నాయకులు భీంబాయి, జంగుబాయి, మమత, ఆశవ్వ, పోసాని, భూమక్క, రేణుక, రాంబాయి, నారాయణ పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-కడెం

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏఎస్సై భీంరావు అన్నారు. సోమవారం మండలంలోని కన్నాపూర్, కొండుకూర్ గ్రామాల్లో వాహనదారులకు, గ్రామస్తులకు రోడ్డు భద్రత నిబంధనలు, సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు తప్పక పాటించాలని అన్నారు. ప్రతి వాహనదారుడు తమ వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. అలాగే తమ మొబైల్ ఫోన్లకు వచ్చే గుర్తు తెలియని మెసేజ్లకు స్పందించవద్దని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు బ్యాంక్ ఎటీఎం నెంబర్లు, వ్యక్తిగత వివరాలు అడుగుతే తెలుపవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బోథ్ కాంగ్రెస్ అభ్యర్థిని మారిస్తే ఆందోళనలు

- కాంగ్రెస్ అధిష్టానానికి తుడుందెబ్బ హెచ్చరిక



మాట్లాడుతున్న తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడెం గణేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భోథ్ నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వన్నెల అశోక్‌ను మారిస్తే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్ తెలిపారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరు లక్షల70 వేల జనాభా ఉన్న ఆదివాసులను అవమానం చేసేల అధిష్టానం నిర్ణయం తీసుకుంటే ఉరుకోబోమన్నారు. వన్నెల అశోక్‌కు టికెట్ ఇచ్చిన అధిష్టానం అభ్యర్థిని మార్చాలని చూస్తుందని, బీ ఫారం కూడా ఇవ్వకుండా ఆపేసిందని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకటన చేయకుంటే ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో పార్టీ అభ్యర్థులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఖానాపూర్ తప్ప పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మారుసుకొల అశోక్, మావల మండల అధ్యక్షులు ఆత్రం గణపతి ఉన్నారు.

తాంసి : బోథ్ నియోజకవర్గం అభ్యర్థి డాక్టర్ వన్నెల అశోక్‌కు పార్టీ బీ ఫామ్ ఇవ్వకుండా మరో వ్యక్తికి ఇస్తే కాంగ్రెస్‌కు ముక్కుమ్మడిగా రాజీనామా చేస్తామని తాంసి మండల కన్వీనర్ కౌడల సంతోష్ స్పష్టం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ వన్నెల అశోక్ నాలుగు సంవత్సరాలుగా పార్టీ బలోపేతం కోసం, తన డాక్టర్ వృత్తిని వదిలి కార్యకర్తలకు అండగా ఉన్నారన్నారు. అభ్యర్థిగా టికెట్ కేటాయించిన పది రోజుల తర్వాత బీ ఫామ్ ఇవ్వక పోవడం గిరిజనులు, కార్యకర్తలను అవమనిచడమే అన్నారు. ప్రచారం ప్రారంభించి ప్రచార రథాలు సిద్ధం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు అందరూ అశోక్‌కు టికెట్ వచ్చిందన్న సంతోషంలో ఉండగా.. అధిష్టానం బీ ఫామ్ ఇవ్వక పోవడం మంచిది కాదన్నారు. వెంటనే బీ ఫామ్ ఇవ్వాలని లేని పక్షంలో పార్టీకి తామంతా రాజీనామ చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గంగారెడ్డి, లక్ష్మీపతి, రామన్న యాదవ్, వామన్ రెడ్డి, హమ్మండ్లు, రాజవలి, కిషన్, వినోద్ రెడ్డి, రతన్ ఉన్నారు.

సిరికొండ : అభ్యర్థి వెన్నెల అశోక్‌ను మార్చే యోచనను పార్టీ విరమించుకోవాలని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు కంచం లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కొందరు పార్టీ నాయకులు పార్టీ ప్రకటించిన అభ్యర్థిని కాదని పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. హైదరాబాద్‌లో మఖం వేసి వారం రోజులుగా అభ్యర్థిపై తప్పుడు ప్రచారాలు చేస్తూ అధిష్టానాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధిష్టానం ఆలోచించి భీ ఫాంను అందజేయాలని డిమాండ్ చేశారు. అభ్యర్థిని మారిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మైనారిటీ ఛైర్మెన్ రంజాన్, జెళ్ళ సతీష్, గణేష్, నర్సయ్య, హిమామ్, రాజేందర్ పాల్గొన్నారు.

బోథ్ : నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిని మారిస్తే ఊరుకునేది లేదని ఆదివాసి నాయక ఫోడ్ మండల నాయకులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని ధన్నూర్-బి, మార్లపెల్లి, పట్నాపూర్, కరత్వాడ, కౌట ఆదివాసి నాయక్ పోడు నాయకులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రెండో జాబితాలో కాంగ్రెస్ అభ్యర్థిగా వన్నెల అశోక్ పేరు ఖరారు చేశారన్నారు. కొందరు నాయకులు ఆయనను వ్యతిరేకించి వేరే అభ్యర్థికి టికెట్ ఇవ్వాలని కోరడంతో వన్నెల అశోక్‌కు బీఫామ్ తిరస్కరించారన్నారు. అశోక్‌ను కాకుండా ఇతరులకు టికెట్ ఇస్తే ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిగాం సాయన్న, రామెల్లి శ్రీనివాస్, పడిగెల వీరయ్య, నల్లల గంగయ్య పాల్గొన్నారు.

పత్తి పంట క్షేత్ర ప్రదర్శన



పత్తి పంటను పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు, రైతులు

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని అశోక్ పత్తి పంట చేనులో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. యోదా 69 సీడ్స్‌కు సంబంధించిన బీటీ 2 వంగడనికి చెందిన పత్తి పంటను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు పంట గురించి తెలియజేశారు. కంపెనీ రీజనల్ మేనేజర్ సతీష్ రైతులకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, డిస్టిబ్యూటర్ శ్రీకాంత్, డీలర్లు కళ్యాణ్ రెడ్డి, విలాస్, రైతులు రాంరెడ్డి, ప్రభాకర్, భూమన్న, రాములు, విలాస్ పాల్గొన్నారు.

పథకాలు కొనసాగాలంటే బీఆర్ఎస్ గెలవాలి



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఇలాగే కొనసాగాలంటే మళ్ళీ బీఆర్ఎస్ ఓటు వేసి గెలిపించాలని నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని జాకీర్ గూడా బోథ్ గ్రామంలో పార్టీ అభ్యర్థి జాదవ్ అనిల్, రిమ్మ, తుమ్మల్ పాడ్, తిమ్మాపూర్, లచ్చింపూర్-బి గ్రామాలలో ఖానాపూర్ అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రజలను కలుస్తూ కారు గుర్తుకు ఓటేయ్యాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటన్న, చందు, ఇక్బాల్, రాజన్న, విజయ్, సునీల్, లస్మన్న పాల్గొన్నారు.

కళాశాలలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలతో కళాశాల విద్యార్థినులు

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీలు ఇంటి నుండి తీరొక్క రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి కళాశాలకు తీసుకువచ్చారు. కళాశాల ఆవరణలో ఒక దగ్గర పెట్టి డీజే పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. అనంతరం గ్రామ వీధుల గుండా గ్రామ సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, ప్రిన్సిపల్ సుదర్శన్, అధ్యాపకులు అనుపమ, వనిత, దేవిక, మల్లేష్, శశికుమార్, శ్రీనివాస్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న డీఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లుగా నమోదు చేసుకున్న విద్యార్థులకు శిక్షణ తరగతులను సోమవారం నిర్వహించారు. జిల్లా డీఈఓ ప్రణీత ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేసి మాట్లాడారు. వాలంటీర్లకు వారి ఇంటి సమీపంలోని పాఠశాలలను కేటాయించినట్లు ఆమె తెలిపారు. శనివారం బడి పిల్లలకు బోధించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్, స్టేట్ ఆర్‌పీలు ప్రతాప్, నారాయణ, సుజాత్ ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి.దయాకర్, అష్రఫ్ అలీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుండి బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులతో ఎమ్మెల్యే రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజా హితం కోసం పాటు పడుతున్న బీఆర్ఎస్ కు మంచి స్పందన లభిస్తోందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగురామన్న అన్నారు. ఈ సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులూ హమీద్ ఖాన్, ఫైజుల్ల ఖాన్ బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ జహీర్ రంజాని పాల్గొన్నారు.

గిరి గూడెల్లో భోగి సందడి



దండారి ఉత్సవాల్లో ఆదివాసుల పూజలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని వివిధ గిరి గూడెల్లో భోగి సందడి నెలకొంది. సోమవారం మండలంలోని కేస్లాపూర్‌లో భోగి పండుగను నిర్వహించారు. పటేల్ వెంకట్ రావ్ ఇంటివద్ద గుస్సాడీలు ధరించే నెమలి ఈకల టోపీ, డప్పులు, రోలు, గజ్జలు సామాగ్రిని ఒక చోటికి పేర్చారు. సాంప్రదాయ ప్రకారం నైవేద్యాన్ని సమర్పించి పూజలు చేశారు. భోగి పూజల అనంతరం గుస్సాడీ వేషధారణను చేపట్టారు. దీపావళి పండుగ వరకు దండారి ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ భోగీ పండగలో గ్రామస్తులు మెస్రం నాగనాథ్, బారీక్ రావ్ పాల్గొన్నారు.

పిప్పల్‌ధరిలో డీఎస్పీ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న డీఎస్పీ అభ్యర్థి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని పిప్పల్‌ధరిలో ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ) ఎమ్మెల్యే అభ్యర్థి అగ్గిమల్ల గణేష్ మహారాజ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహరాజ్ 10 హామీలను పెట్టడం జరిగిందన్నారు. 10 హామీలను చదివి వినిపిస్తూ టార్చ్ లైట్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం మండలంలో అంకోలి, తంతోలి, లోకారి, వాన్‌వాట్, మామిడిగూ గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేశారు.

కాంగ్రెస్‌ను ఆదరిస్తే ఆరు పథకాలు అమలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కాంగ్రెస్‌నీ ఆదరించి భారీ మెజారిటీతో గెలిపిస్తే ఆరు గ్యారెంటీ స్కీమ్‌లు అమలు చేస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షులు ముకాడే ఉత్తం అన్నారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని అందుతాండ, మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. తొలుత మండల కేంద్రంలో వారాంతపు సంత, ప్రధాన మార్కెట్‌లో కళాజాత బృందంతో ప్రచారం చేశారు. గోండి భాషలో పాటల ద్వారా ఆరు గ్యారెంటి కార్డులను వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎండీ.జహీర్, వెంకట్‌రావ్ నాయకులు పాల్గొన్నారు.

నియంత పాలనకు చరమగీతం పాడాలి

● నిర్మల్ నియోజవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావు

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోందని, ఈ ఎన్నికల్లో ఆ పాలనకు చరమగీతం పాడాలని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి మొదటి సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అటు రాష్ట్రంలో, ఇటు నిర్మల్‌లో కుటుంబ పాలన కొనసాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్ల కాలంలో ప్రజలకు చేసింది ఏమీ లేదని అన్నారు. అబద్ధపు మాటలతో ప్రజలను మభ్యపెడుతున్న సీఎం కేసీఆర్‌కు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం జరుగుతున్న ఈ పోరాటంలో అప్రజస్వామిక పాలనను అంతం చేయడానికి కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని కోరారు. 2018లో కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను పర్యాటక ప్రాంతంగా ప్రకటించిన కేసీఆర్, ఇప్పుడెందుకు చూడటానికి అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజల పార్టీ అని, ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉద్యమ నాయకుడిగా ఎన్నో పోరాటాలు చేశానని, ఈ ఎన్నికల్లో ఆశీర్వదించి, గెలిపించాలన్నారు.



నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు

కదిలి ఆలయంలో పూజలు...

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నిర్మల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు తన నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా దిలావర్‌పూర్ మండలంలోని కదిలి శ్రీ మాతన్నపూర్ణ, పాప హరేశ్వర ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం స్వామి వారికి ముడుపులు చెల్లించారు. ఇందులో జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, న్యాయవాది మాధురి, నాయకులు సాద సుదర్శన్, అర్జుమాన్ అలీ, గాజుల రవి కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని బీజేపీకి చెందిన పలువురు యువకులు సోమవారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. గత కొన్నేండ్లుగా బీజేపీలో పనిచేస్తున్న సీనియర్ నాయకుడు కోడె కృష్ణ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై పార్టీలో చేరామని బీఆర్ఎస్ గెలుపునకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఆయనకు రంజిత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టపాసు దుకాణాల యజమానులు లైసెన్సులు కలిగి ఉండాలి

నవతెలంగాణ-కడెం

టపాసుల దుకాణాల యజమానులు తప్పని సరిగా లైసెన్సులు కలిగి ఉండాలని ఎస్సై కోనస రాజు అన్నారు. సోమవారం టపాసు దుకాణాలను తనిఖీ చేశారు. దీపావళి సందర్భంగా టపాసులు విక్రయించే దుకాణ యజమానులు తప్పనిసరిగా లైసెన్సులు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దుకాణాల లైసెన్సులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వెంకటేష్ ఉన్నారు.

నిరుపేద వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలో పద్మావతినగర్ కాలనీలో గత కొద్ది సంవత్సరాలుగా నివాసం ఉంటున్న నిరుపేద వృద్ధ దంపతులు నివాసముంటున్నారు. కాగా సోమవారం పన్నెల మల్లయ్యా అనారోగ్యంతో మృతి చెందాడు. అంత్యక్రియలకు ఎవరు ముందుకు రాకపోవడంతో విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ దగ్గరుండి మున్సిపల్ సిబ్బంది చేత అంత్యక్రియలను జరిపించారు. ఈ అంత్యక్రియల్లో ఎస్సై లింబాద్రి, మున్సిపాలిటీ అధికారులు మానాల శంకర్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పీఓ, ఏపీఓలకు శిక్షణ



నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల నేపథ్యంలో నూతనంగా నియమించబడ్డ పీఓ, ఏపీఓలకు మాస్టర్ ట్రైనర్ సోమవారం కలెక్టరేట్ సమవేశ మందిరంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది అందరూ విధుల్లో అలసత్వం లేకుండా, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి విషయంలో అవగాహనతో ఎన్నికల విధులను పూర్తిచేయాలని అన్నారు. రాబోయే 25 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో నూతనంగా నియమించబడిన పీఓ, ఏపీఓలకు దాదాపు 150 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఏ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని సందేహాలను నివృత్తి చేసుకొని విధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికలను నిష్పక్షపాతంగా సజావుగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో పీఓలు, ఏపీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

ముధోల్ బీజేపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు

నవతెలంగాణ-ముధోల్

నామినేషన్ల పర్వం ప్రారంభమైన నాలుగో రోజు సోమవారం ముధోల్ అసెంబ్లీ స్థానానికి ముధోల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పవార్ రామారావు పటేల్ నామినేషన్ దాఖలు చేశారు. నలుగురు పార్టీ ప్రతినిధులతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాన్ని చేరుకున్న ఆయన రెండు నామినేషన్ సెట్లను రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కోమల్ రెడ్డికి అందజేశారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా సీఎం కేసీఆర్ పథకాలు



ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు రామాదేవి

నవతెలంగాణ-బాసర

దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా తెలంగాణ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు అనువైన పథకాలను ప్రవేశపెట్టారని బీఆర్ఎస్ నాయకురాలు రమాదేవి అన్నారు. సోమవారం ముధోల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తరఫున మండల కేంద్రంలో విస్తృతంగా ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి విఠల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రభుత్వం తెలంగాణ ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతులకు రైతుబంధు, రైతుబీమా, 57 సంవత్సరాలు నిండిన వారికి ఆసరా పింఛన్లు అందిస్తున్న ఘనత కేసిఆర్‌కే దక్కుతుందన్నారు. మూడోసారి సీఎంగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేస్తారని, ముధోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింగ్‌రావు, పీఏసీఎస్ చైర్మెన్ వెంకటేష్‌గౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ రామారావు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కొర్వా శ్యామ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ఎన్నో పథకాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మైనార్టీల సంక్షేమం కోసం ఆలోచించి, అనేక పథకాలను ప్రవేశపెట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి అన్నారు. సోమవారం తన నివాసంలో మైనారిటీల కోసం ప్రవేశపెట్టిన పథకాలకు సంబంధించిన కరపత్రాలను, కేటీఆర్ సేవా సమితి రాష్ట్ర నాయకుడు అజ్జుతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మైనారిటీల కోసం ప్రవేశ పెట్టిన పథకాలే మళ్లీ తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని హ్యాట్రిక్ విజయం సాధించి పెడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్ సేవా సమితి నాయకులతో పాటు స్థానిక బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు, అన్సార్, ఇర్ఫాన్ వసీం, జాకీర్, స్థానిక ఎంఐఎం నాయకులు సల్మాన్, అలీతో పాటు మైనార్టీలు పాల్గొన్నారు.



మైనార్టీ పథకాల కరపత్రాలను విడుదల చేసిన కోవ లక్ష్మీ

చెక్కు విరాళంగా అందించి... అభిమానం చాటి...



మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో ఓ రిటైర్డ్ సైనిక ఉద్యోగి తన ఒక నెల పెన్షన్ మొత్తాన్ని అందించి తన అభిమానాన్ని చాటుకున్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని వద్యాల్ గ్రామానికి చెందిన రిటైర్డ్ సైనిక ఉద్యోగి సల్ల రాజేంద్రప్రసాద్ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ముచ్చటగా మూడో సారి గెలిచి ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ ఇంద్రకరణ్‌రెడ్డి నామినేషన్ ఖర్చుల నిమిత్తం తనకు వచ్చే ఒక నెల పెన్షన్ రూ.30వేల 931ను విరాళంగా అందించి, ఐకేరెడ్డిపై ఉన్న అభిమానాన్ని చాటారు. ఈ సందర్భంగా పెన్షన్ చెక్కును మంత్రికి అందజేశారు. రాజేంద్రప్రసాద్‌ను స్థానిక బీఆర్ఎస్ నాయకులు అభినందించారు.

నవతెలంగాణ-లక్ష్మణచాంద

8న సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బెజ్జూర్

ఈ నెల ఎనిమిదవ తేదీన కాగజ్‌నగర్ పట్టణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప కోరారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కాగజ్‌నగర్‌లో పర్యటనకు రానున్న నేపథ్యంలో కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన నిధులు కేటాయించేందుకు హామీ ఇచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగ్గాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు జావిద్ అలీ, నాహిర్ అలీ, పుల్లూరి సతీష్, రామకృష్ణ, మహేష్, సునీత పాల్గొన్నారు.

మళ్లీ ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ గెలుస్తుంది

● డీసీసీ ప్రెసిడెంట్ విశ్వప్రసాద్ రావు, అజ్మీరా శ్యామ్ నాయక్



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కెరమెరి

ఆసిఫాబాద్‌లో మరోసారి ఎగిరేది కాంగ్రెస్ జెండానేనని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్యామ్ నాయక్ అన్నారు. సోమవారం ఝరి గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల చేరిక కార్యక్రమంలో పాల్గొని వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్‌లో భారీగా చేరికలు జరగడం రేపటి కాంగ్రెస్ విజయానికి పునాదని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ గడ్డపై మరో సారి కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. త్వరలో జరిగే ఎన్నికల యుద్ధంలో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్యామ్ నాయక్ గెలుపు కోసం ప్రణాళిక బద్ధంగా పని చేయాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేద ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారని విమర్శించారు. బడుగు బలహీన వర్గాల ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలంతా కంకణం కట్టుకున్నారని తెలిపారు. కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండీ మునీర్ అహ్మద్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో స్థానిక మండల అధ్యక్షుడు ఆత్రం కుసుంరావ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్ష్మణ్ రావు, నాయకులు రాథోడ్ శంకర్ నాయక్, మహిళా నాయకురాలు రాథోడ్ రాజేంద్ర కుమారి బాయి, ఇరుకుళ్ల మంగా, బాపురావ్, బాబు నాయక్, వెంకటస్వామి పాల్గొన్నారు.

వారసంతలో హోరాహోరీ ప్రచారం



కౌటాల : మండలకేంద్రంలోని వారసంతలో బీఆర్ఎస్, బీఎస్పీ, కాంగ్రెస్ నాయకులు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. మూడు పార్టీలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు నిర్వహిస్తూ మైకులతో హోరెత్తించారు. మూడు పార్టీల నాయకులు గొడవ పడుతారా అనే పరిస్థితులు నెలకొన్నాయి. కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్సై మధూకర్ ఆధ్వర్యంలో మూడు పార్టీలు గొడవలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. బీఆర్ఎస్, బీఎస్పీ ప్రక్కనే కాంగ్రెస్ కార్యకర్తలు పాటలతో నృత్యాలు చేస్తూ కవ్వింపులకు పాల్పడ్డారు. ఇరు పార్టీల సమన్వయం పాటించే విధంగా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ ప్రచారంతో సుమారు రెండు గంటల పాటు ఇరు పార్టీల మైకుల మోతకు సంతకు వచ్చిన వారు సౌండ్ భరించలేకపోయారు. ఏ పార్టీకి సంబంధించిన పాటలపై ఆ పార్టీ వారు నృత్యాలు చేయడంతో ఎవరికి అర్థంకాని పరిస్థితి నెలకొంది. తమ బలబలాలను చూపించేందుకు అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి సంతలోకి వచ్చారు. ఎన్నికలు ఇంకా 24 రోజులు ఉండగానే ప్రచారం ముమ్మరం చేస్తున్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడి ఎన్నిక



నవతెలంగాణ-కెరమెరి

కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కూటికల వెంకటస్వామి ఎన్నికయ్యారు. సోమవారం మండలంలోని ఝరి గ్రామంలో, కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తల చేరిక సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ డీసీసీ ప్రెసిడెంట్ కొక్కిరాల విశ్వప్రసాద్ ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడిగా నియమించడంతో తన వంతు బాధ్యతగా పార్టీ నిర్మాణం కోసం పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్యామ్ నాయక్, రేఖా నాయక్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎండీ మునీర్ అహ్మద్, మండల అధ్యక్షుడు కుసుంరావు పాల్గొన్నారు.

ఆశావర్కర్లతో డాక్టర్ సమావేశం

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశావర్కర్లతో సోమవారం డాక్టర్ ఉప్రె వినయ్ సమావేశం నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డ సంరక్షణ ఆవశ్యకత గురించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశాలకు, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-బెజ్జూర్

మండల ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం స్థానిక సంఘ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ ఇబ్రహీం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేందర్, ప్రధాన కార్యదర్శిగా బిశ్వాస్, కోశాధికారిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా రమేష్, బాపురావు, గౌరవాధ్యక్షులుగా వద్దిబిదాస్, బాలాజీ, శివప్రసాద్, భాస్కర్, ప్రచార కార్యదర్శిగా యాదగిరి, సహాయ కార్యదర్శిగా మహేష్, సలహాదారులుగా షౌకత్ అలీ, అమృత, సునీత, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఇబ్రహీం మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల సాధనకు తమవంతు ప్రయత్నం చేస్తామని, గతంలో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్‌కు పక్కా భవనం లేకున్నా దానిని నిర్మించుకోగలిగామన్నారు. పక్కా భవనంలో మరిన్ని సౌకర్యాలు కల్పించుకుంటూ ఆర్ఎంపీ, పీఎంపీ సమస్యల పరిష్కారానికి ప్రయత్నం చేస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఆర్ఎంపీ, పీఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిని సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

పెంచికల్‌పేట్ : మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్పకు మద్దతుగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా ఓటర్లకు బీఆర్ఎస్ మేనిఫెస్టోలోని అంశాలను వివరించి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మధునయ్య, శ్రీనివాస్, చంద్రమౌళి, కోఆప్షన్ సభ్యుడు సాజిద్, నాయకులు సముద్రాల రాజన్న, కృష్ణ, మహేష్, భీమయ్య, శ్రీనివాస్, రామన్న, బండన్న పాల్గొన్నారు.

సీఎం అల్పాహారం ప్రారంభం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

రాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సీఎం అల్పాహారంను సర్పంచ్ బొమ్మల పద్మ కిషన్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 8.30 గంటలకు అల్పాహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయులు చిలుకూరు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిరోజు అల్పాహారంలో రోజుకు ఒక రకంగా ఉప్మా, పూరి, ఇడ్లీ, కిచిడి, పూహా తదితర అల్పాహారాలని విద్యార్థులకు ప్రతిరోజు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు బెజ్జాని రమేష్, ఉపాధ్యాయులు ఏటుకూరి శ్రీనివాసరావు, ఇందారపు ప్రకాష్, మహిపాల్, గాయత్రి, దివ్యశ్రీ, రవికుమార్, ఉమేష్ పాల్గొన్నారు.

మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయాలి

నవతెలంగాణ-కౌటాల

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడానికి అందరు కృషి చేయాలని సిర్పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి గ్రామం నుండి కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి అభివృద్ధి పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని సూచించారు. 10 సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రతి ఇంటికి పథకాలు అందుతున్నాయన్నారు. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడడమే ధ్యేయమన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి సిర్పూర్ ఎమ్మెల్యేగా నన్ను ఆశీర్వదించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బీఎస్పీలో చేరికలు

పెంచికల్‌పేట్ : మండలకేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో బీఎస్పీ నాయకుడు బిట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం గుండెపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు బీఎస్పీలో చేరారు. వారందరికి బీఎస్పీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించడానికి అందరు కృషి చేయాలని కోరారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి భారీ చేరికలు

రెబ్బెన : తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పార్టీ విధి విధానాలు నచ్చి కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఆసిఫ్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి శ్యామ్‌నాయక్ బలవంతంగా గోలేటి గ్రామానికి వచ్చి ఆసిఫ్‌ను బలవంతంగా కాంగ్రెస్ కండువా కప్పారు. ఒకసారి పార్టీకి రాజీనామా చేసిన తర్వాత మళ్లీ బలవంతంగా కండువా కప్పడం సరైన పద్ధతి కాదని, కాంగ్రెస్ విధానాన్ని ఖండిస్తూ కోవలక్ష్మి నాయకత్వంలో బీఆర్ఎస్‌లో ఉంటూ సేవ చేస్తానని తెలిపారు.

నవజాత శిశు సంరక్షణపై అవగాహన

నవతెలంగాణ-బెజ్జూర్

మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం నవజాత శిశు సంరక్షణపై పీహెచ్ఎన్ కమల ఏఎన్ఎం, ఆశావర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీహెచ్ఎన్ కమల మాట్లాడుతూ నవజాతి శిశువులకు సరైన సమయంలో టీకాలు ఇవ్వాలని, ధనుర్వాతం, పచ్చ కామెర్లు రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మంచిర్యాల
మంగళవారం నవంబర్, 7, 2023


మేకలు, గొర్లకు వ్యాక్సినేషన్ల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్, లింగాయపల్లి, చింతలపల్లి గ్రామాల్లో పశువైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ సోమవారం గొర్రెలు, మేకలకు వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా, గొర్రెలు, మేకల పెంపకం దారులు, యజమానులు ముందస్తుగా ఈ వ్యాక్సిన్ వేయిన్చాల్సిందిగా సూచించారు. ఇప్పటికీ 4750 గొర్రెలు 1500 మేకలులో ఈ వాక్సిన్ అందించడం జరిగిందన్నరు. కావలసిన రైతులు, యజమానులు, పెంపక దారులు స్థానిక పశు వైద్య శాలలో సంప్రదించాలని సూచించారు.



మండలంలో విద్యాశాఖ రాష్ట్ర బృందం పర్యటన



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర విద్యాశాఖ బృందం సోమవారం సందర్శించింది. పాఠశాల విద్యను పటిష్ట పరచడానికి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రాథమిక అక్షరాస్యత సంఖ్య శాస్త్రం(ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం ఉన్నతిని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న లక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాన్ని వారు పరిశీలించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. మామిడిపల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ పరిశీలించి తరగతి గదులలో బోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులు జాయింట్ డైరెక్టర్ ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన విద్యను బోధించాలని సిబ్బందికి సూచించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం పదవ తరగతి విద్యార్థులకు ప్రవేశపెట్టిన లక్ష్య కార్యక్రమం పనితీరు బాగుందని అన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కాసుల రవీందర్, ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, కవిత, సీఆర్పీ సురేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో కొనసాగుతున్న చేరికల పరంపర

- బీఆర్ఎస్ సర్పంచులతో పాటు తటస్థులు
- వీరి బాటలోనే మరికొందరు సర్పంచులు
- సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చిన వివేక్ వెంకటస్వామి

నవతెలంగా-జైపూర్

ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్ది రాజకీయ సమీకరణాల్లో మార్పు చోటు చేసుకుంటున్నాయి. చెన్నూర్ నియోజకవర్గం పరిధి కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ తాజా మాజీ సర్పంచుల చేరిక పరంపర కొనసాగుతోంది. ఆదివారం నియోజకవర్గ కేంద్రానికి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు సమక్షంలో జైపూర్ మండలానికి చెందిన పలువురు తాజా మాజీ సర్పంచులు తటస్థులు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. సోమవారం ఉదయం మంచిర్యాలలో వివేక్ వెంకటస్వామిని కల్సిన మరి కొందరు సర్పంచులు, పార్టీ పదవుల్లో కొనసాగుతున్న వారు కాంగ్రెస్ తీర్థం పుచుకున్నారు. డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, ఆధ్వర్యంలో చేరికలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన సర్పంచుల్లో నామాల సత్యవతి తిరుపతి, లింగారెడ్డి, పద్మజ పాపిరెడ్డి, ప్యాగ శ్యామల లక్ష్మన్, గుండ్రాల్ల ఎల్లమ్మ, పండుగ బుచ్చమ్మ, తాటి జయపాల్ గౌడ్, జనంపల్లి రాజేశ్వరి వెంకటి, గోనె సుమలత నర్సయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బేతు తిరుపతి రెడ్డి, మాజీ జడ్పీటీసీ చల్ల భారతి సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటి మాజీ వైస్ ప్రసిడెంట్ గుడిల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుడెల్లి రాజిరెడ్డి, రిక్కుల వెంకట్ రెడ్డి, సంతోషం చంద్రశేఖర్, రామటెంకి సమ్మయ్య, ధన్వాడ మహేందర్ రెడ్డి, నరెడ్ల రాజిరెడ్డి, రజియా బేగం, నరెడ్ల శ్రీనివాస్ రెడ్డి, పాలమాకుల అంజిరెడ్డి, జనగామ చిన్నయ్య, కన్నయ్య, ఎనగందుల జ్యోస్న, నరెడ్ల వెంకట్ రెడ్డి అదేవిధంగా మండల పరిధి వివిధ గ్రామాలకు చెందిన పలువురు వార్డు సభ్యులు, నాయకులు, తటస్థులు వివేక్ వెంకటస్వామి సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకలు మహమ్మద్ ఫయాజోద్దీన్, చల్ల విశ్వంబర్ రెడ్డితో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





మరికొందరు చేరే అవకాశాలు

మండలానికి సంబంధించి వివిధ గ్రామాలకు చెందిన 9 మంది సర్పంచులు ఇప్పటికే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ చేరగా వీరితో పాటు మరికొందరు త్వరలోనే చేరే అవకాశం ఉన్నట్టు తెలిసింది. బీఆర్ఎస్‌ను వీడేందకు సిద్ధంగా ఉన్నవారిని గుర్తించిన వివేక్ వెంకటస్వామి స్థానిక నాయకులతో సంప్రదింపులు జరిపిస్తున్నట్లు విశ్వసనీయ సామాచారం ఒకటి రెండు రోజుల్లో మరికొందరు సర్పంచులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో సంప్రదింపులు

నియోజకవర్గం పరిధిలో గల వివిధ మండలాలు, గ్రామాలకు చెందిన దిగువశ్రేణి నాయకులు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో టచ్‌లో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థిగా మొదటి సారి మంచిర్యాలకు వచ్చిన వివేక్ వెంకటస్వామి మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలుతో పాటు డాక్టర్ రాజారమేష్‌ను వారి వారి నివాసాలకు వెళ్లి కలిశారు. బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన వివేక్ వెంటస్వామితో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపిన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ప్రకటించడంతో పాటు చెన్నూర్‌లో బీఆర్ఎస్‌ను ఓడించడమే లక్ష్యమని ప్రకటించారు. ఈ క్రమంలో రాజకీయంగా తనతో సంబంధాలు ఉన్న వారితో పాటు వివేక్ వెంకటస్వామితో గతంలో కూడా పని చేసిన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారు.

సముచిత స్థానం కల్పిస్తాం

కాంగ్రెస్‌తోనే బడుగుబలహీణ వర్గాలవారి అభివృద్ధి సాధ్యమని నమ్మి పార్టీలో చేరిన వారందరికి సముచిత స్థానం కల్పిస్తామని వివేక్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడం కోసం వివేక్ వెంకటస్వామితో కలిసి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకు తమవంతు కృషి చేస్తామని స్థానిక నాయకులు పేర్కొంటున్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ-జన్నారం

ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయకులు భారీ మెజార్టీతో గెలిపించాలని మండలంలోని బాదంపల్లి ఉపసర్పంచ్ ఆనందం, కవ్వాల్ సీనియర్ నాయకుడు ఫజల్ ఖాన్ అన్నారు. సోమవారం బాదంపల్లి, కవ్వాల్ గ్రామాల్లో వేరువేరుగా ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. మేనిఫెస్టోను చదివి వినిపించారు. తెలంగాణలో మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి చేయాలని కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని అచలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉన్న వసతులను ఎంపీడీఓ వి ప్రవీణ్ కుమార్ సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ సెక్రెటరీ క్రాంతి కుమార్‌కు సూచించారు. వచ్చే సంవత్సరానికి గాను నర్సరీకి సంబంధించి మట్టి ఎరువు మిశ్రమం తయారు చేసి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని మల్టీ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, బృహత్ పల్లె ప్రకృతి వనం, మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా నిర్మించినటువంటి కాంపౌండ్ వాల్, మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించిన అటువంటి సీసీ రోడ్డు పనులను, గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్నటువంటి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ వాసుదేవ్ ఉన్నారు.



పోటాపోటీగా ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు సోమవారం పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో పాటుపలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రచారం నిర్వహించారు. పార్టీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇటు బీఆర్ఎస్ నాయకులు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించారు. నడిపెల్లి దివాకర్ రావుకు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు గ్రామ గ్రామాన తిరుగుతూ దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత ప్రధాని మోడీదని రాష్ట్రంలో కూడా ఒక అవకాశం కల్పిస్తే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని తమ ఓటును మంచిర్యాల బీజేపీ అభ్యర్థి వెరబెల్లి రఘునందన్ రావుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అన్ని పార్టీల ప్రచార రథాలు గ్రామాల్లో వారసంతల వద్ద మైకులతో ప్రచారం నిర్వహించారు. దీంతో మండలంలో ఎక్కడ చూసినా ఎన్నికల ప్రచార సందడి నెలకొంది.



కస్తూర్బా విద్యాలయంలో కళా ఉత్సవ పోటీలు

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం మండల స్థాయి కళా ఉత్సవ పోటీలను ఎంఈఓ వాసాల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రయివేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఈ నెల 9, 10వ తేదిల్లో మంచిర్యాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సుమన చైతన్య, ఉపాధ్యాయులు సీఆర్‌టీ నాగరాజు పాల్గొన్నారు



కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి

- రూ.5కోట్ల ఇసుక దందాలో బాల్క సుమన్ వాటా రూ.2వేల కోట్లు
- ప్రజల ఒత్తిడితోనే చెన్నూర్ నుండి పోటీ
- చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి


కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న గడ్డం వినోద్

నవతెలంగాణ-జైపూర్

కల్వకుంట్ల కమీషన్‌రావు ప్రభుత్వంలో దోచుకునుడు..దాచుకునుడేనని చెన్నూర్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేక్ వెంకటస్వామి విమ్మర్శించారు. సోమవారం ఇందారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేసీఆర్ కుటుంబంతో పాటు చెన్నూర్ బీఆర్ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌ను ఘాటుగా విమ్మర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని ధీమా వ్యక్తం చేసిన ఆయన పార్టీ అధికారంలోకి వస్తే కల్వకుంట్ల చంద్రశేఖర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ దోచుకున్న సొమ్మును కక్కిస్తామని తెలిపారు. చెన్నూర్ గోదావరి నది నుండి రూ.5వేల కోట్ల ఇసుక దందా జరిగితే ఇందులో నుండి ప్రభుత్వానికి చెల్లించాల్సిన టాక్సీ సొమ్ము రూ.2వేల కోట్లు బాల్క సుమన్ దోచుకున్నాడని ఆరోపించారు. నియోజవర్గంలో పర్యటిస్తున్న క్రమంలో వారి నుండి వచ్చిన ఒత్తిడితోనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీలో నిలబడినట్లు తెలిపారు. పెద్దపల్లి ఎంపీగా నియోజకవర్గ ప్రజలను ఎన్నడూ విడిచి ఉండలేదన్నారు. ఓడినా గెలిచినా ప్రజల సేవకే అంకితమని చెప్పిన ఆయన పదవిలో లేకున్నా తమకు చెందిన విశాఖ ట్రస్టు ద్వారా ప్రజలకు అవసరమై అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కేసీఆర్‌కు చిన్న కొడుకుగా వ్యవహరిస్తున్న ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్ పార్టీ క్యాడర్‌ను, ప్రజలను పట్టించుకోకుండా కమీషన్ల కోసం పని చేశాడని విమ్మర్శించారు. 30న జరిగే పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ మూల రాజిరెడ్డి, సీనియర్ నాయకులు ఫయాజ్, దుర్గం నరేష్, డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు మహ్మద్ ఫయాజోద్దీన్, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందారం నుండి చెన్నూర్ వరకు భారీ బైక్ ర్యాలీ

చెన్నూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందారం నుండి చెన్నూర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు మహ్మద్ ఫయాజోద్దీన్‌తో కలిసి రాజీవ్ రహదారి మీదుగా ఇందారం ఎక్స్ రోడ్డు, రసూల్‌పల్లి, జైపూర్, భీమారం మీదుగా చెన్నూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీగా వచ్చిన వివేక్ వెంకటస్వామి జైపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ ప్రసంగించారు. చెన్నూర్ నియోజకవర్గం పరిధిలో గల కోటపల్లి, చెన్నూర్, భీమారం, జైపూర్, మందమర్రి మండలం నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు వందలాదిగా బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి

నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి కోరారు. సోమవారం మండలంలోని మలంగి తాండ, గోండు గూడెంలో మండల పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రం సాధించినప్పటి నుండి బీఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలను అభివృద్ధి పనులను వివరించారు. మేనిఫెస్టోలో అమలు చేసే పథకాలను ప్రజలకు తెలియజేస్తూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మెన్ సురేష్ ఆడే, మాజీ జెడ్పీటీసీ రూపావతి జ్ఞానోబా పుష్కర్, ఏఎంసీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, కో ఆప్షన్ సభ్యుడు దస్తగీర్, నార్నూర్ సర్పంచ్ గజానంద్ నాయక్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రూప్ దేవ్, మండల అధ్యక్షుడు హనుమంత్ రావ్, సీనియర్ నాయకులు నర్సింగ్ మోరే, సయ్యద్ ఖాసిం, కాంతారావ్ దుర్గే, కనక ప్రభాకర్, అనుసయ గోపాల్, విష్ణు, ఉత్తం పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యాసంస్థలకు వందగజాల పరిధిలో పొగాకు ఉత్పత్తులను వాడడం నేరమని ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్ అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఖానాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను పొగాకు రహిత విద్యాసంస్థగా ప్రకటించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పొగాకు ఉత్పత్తులు, ధూమపానం, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. పాఠశాలలకు 100 గజాల పరిధిలో గల దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడం పొగాకు రహిత విద్యాసంస్థల నియమావళి ప్రకారం నేరమన్నారు. నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్, పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, పాల్గొన్న అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్త, శ్యామలదేవి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సి-విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులను 100 నిమిషాలలో పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే ప్రజలు సి- విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదులను వంద నిమిషాల్లో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. బాధ్యతాయుత పౌరుని చేతిలో బ్రహ్మాస్త్రం సి-విజిల్ యాప్ అని, ఇందులో ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం, నగదు, వస్తువులు, మద్యం పంపిణీ చేయడం, ప్రజల ఆస్తులను అనుమతి లేకుండా ప్రచారాలకు వినియోగించడం, కుల మత ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం, ఓటర్ల రవాణా, అసత్య వార్తల ప్రసారం, చెల్లింపు వార్తలు ప్రచురణ, మారణాయుధాలు కలిగి ఉండడం, ఇతర ఎన్నికలకు సంబందించిన ఫిర్యాదులను చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను వెంటనే సి-విజిల్‌లో అప్లోడ్ చేయడంతో నిర్ణీత కాల వ్యవధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ జరిపి 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అనంతరం సి-విజిల్ యాప్ ఫిర్యాదులపై ఈడిఎం రవికుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్త, శ్యామలాదేవి, ఈడీఎం రవి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

రూ. 4 వందలకే గ్యాస్ అందిస్తాం


ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్న జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రూ. 4 వందలకే గ్యాస్‌ను అందిస్తామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మండలంలోని పొచ్చర, దిమ్మ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ముందుగా రోడ్ షో నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ పార్టీ మేనిఫెస్టోను వివరిస్తు ఓట్లను అభ్యర్థించారు. ఉచిత గ్యాస్ అని చెప్పి బీజేపీ రూ.12 వందలకు పెంచిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 4 వందలకు గ్యాస్‌ను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, వైస్ ఎంపీపీ జంగుపటేల్, ఆత్మ చైర్మెన్ జిట్ట రమేష్, మార్కెట్ చైర్మెన్ కుమ్ర విజయలక్ష్మి రాజు పాల్గొన్నారు.

మసీదులకు ఇచ్చిన ఇనాం భూములను అప్పగించాలి

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలో మసీదులకు ఇచ్చిన ఇనాం భూములను తిరిగి అప్పగించాలని జామా మసీదు కమిటీ సభ్యుడు షకిల్ ఖాన్ అన్నారు. సోమవారం పరిశీలనకు వచ్చిన వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ సద్దంను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 45 ,46లో 16 ఎకరాల 13 గుంటల భూమిని జామా మసీదు కమిటీకి అప్పగించాలన్నారు. మసీదుకు ఇనాం ఇచ్చిన భూమిని నవాబుద్దీన్ ఖాజీ అమ్ముకున్నాడని, ఆ భూమికి సంబందించి హైకోర్టులో కేసు నడుస్తుండగా ఏ విధంగా అమ్మాడని ప్రశ్నించారు. ఆ భూమిని అమ్మిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, మసీదు భూమిని గ్రామ మసీద్ కమిటీకు అప్పగించాలని వక్ఫ్‌బోర్డ్ ఇన్స్‌పెక్టర్‌ని కోరారు. వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ సద్దం మాట్లాడుతూ సర్వే నంబర్ 45 46 లోని 16 ఎకరాల 13 గుంటల భూమిని పరిశీలించామన్నారు. దీనికి సంబంధించిన పత్రాలను పరిశీలించి త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందులో వక్ఫ్‌బోర్డ్ జూనియర్ అసిస్టెంట్ అశ్వక్, మజీద్ కమిటీ సభ్యులు అఖ్తర్ సాహెబ్, ఎండీ సుభాన్, తన్వీర్ ఖాన్, షాహెజాద్, సిరాజ్, తబ్రేజ్, సాదిక్, జహుర్, సనఖాన్, సమీర్, అక్బర్ ఖాన్ పాల్గొన్నారు.



20 నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ కొత్త బ్యాచ్ ఈనెల 20 నుంచి ప్రారంభించనున్నట్టు డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు హెవీ మోటార్ డ్రైవింగ్ నేర్చుకోవడానికి డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. దీనికి ఫీజు రూ.15600 చెల్లించాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు లైట్ మోటర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మరిన్నీ వివరాలకు ఆదిలాబాద్ డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్‌పెక్టర్ ఎస్.కె యూసుఫ్ సెల్ ఫోన్ నెంబర్ 7382840349 సంప్రదించాలని సూచించారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు లంబాడి హేటి గ్రామాల్లో ముందస్తు సమాచారం మేరకు సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. లంబాడి హెట్టిలో చంగునా బాయి ఇంటి నుంచి 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. రణవెల్లి గ్రామ శివారులో 5వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. మండల కేంద్రంలోని చిప్ప చిరంజీవి కిరాణా షాపుల్లో నాలుగు బీర్, ఒక ఓసి, నాలుగు ఆర్ఎస్, మూడు ఐబీ ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- ఆసిఫాబాద్ ఎస్పీ కె.సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో స్వేచ్ఛ, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించడమే లక్ష్యమని ఎస్పీ కె.సురేష్ కుమార్ అన్నారు. 30న జరిగే శాసనసభ ఎన్నికలకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం పోలీస్ అధికారులు అన్ని ఏర్పాట్లతో పూర్తి సిద్ధంగా ఉండాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ నాయకులకు సెల్యూట్ వంటివి చేయరాదని, ఈసీఐ విధివిధానాలు మాత్రమే పాటించాలన్నారు. వీఐపీలు, వీవీఐపీలు, స్టార్ క్యాంపెనర్‌ల భద్రత అంశాలు అవలంభించాల్సిన పద్ధతులను సూచించారు. ఎన్నికలకు సంబంధించి అన్ని అంశాలపై పోలీసు అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడటంతో పాటు సమస్యలు సృష్టించే వారినీ బైండోవర్ చేయాలని ఆదేశించారు. గత ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించిన వారిపై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. చెక్ పోస్టు వద్ద, ఇతర ప్రదేశాల్లో తనిఖీల్లో వీడియో కవరేజ్, నగదు, మద్యం పట్టుకుంటే సంబంధిత అధికారులు అనుసరించాల్సిన వాటిపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, రమేష్, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ రాణాప్రతాప్, సీఐలు, ఆర్ఐలు, ఎస్సై లు, ఆర్ఎస్ఐలు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కె.సురేష్ కుమార్

బీజేపీ మండల అధ్యక్షుల రాజీనామాలు

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి నియోజకవర్గంలోని తాండూర్, బెల్లంపల్లి బీజేపీ మండల అధ్యక్షులు రామగౌని మహీధర్ గౌడ్, గజెల్లి రాజ్ కుమార్ సంయుక్తంగా రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను పత్రిక ముఖంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతానికి కష్టపడి పనిచేసిన వారికి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీదేవి స్థాయికి తగ్గ ప్రాముఖ్యత ఇవ్వకపోవడం వల్ల రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. అర్హత లేని వారికి టిక్కెట్టు ఇవ్వడం కారణంగా పార్టీ పరిస్థితి రోజురోజుకు దిగజారి పోతుందన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో పార్టీ గెలిచే పరిస్థితి లేదన్నారు.



సుడిదోమ నివారణకు సస్యరక్షణ చర్యలు



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో

నవతెలంగాణ-తాండూర్

వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సుడిదోమ నివారణకు సంరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి సూచించారు. సోమవారం మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో వరి పొలాలను పరిశీలించారు. సుడిదోమ నివారణపై రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం పంట పొలాల్లో సుడిదోమ ఉధృతి కనిపిస్తుందని, సంస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వాతావరణ పరిస్థితులు సుడిదోమ కంకులు ఏర్పడే దశలో ఆశిస్తుందన్నారు. దోమ ఆశించిన పంట పొలాల్లో పైరు లేత పసుపు రంగుకు మారి ఎండిపోయినట్లు కనిపిస్తుందన్నారు. రైతులు గమనించి సమస్యరక్షణ చర్యలు తీసుకోకపోతే నష్టం తీవ్రంగా ఉంటుందన్నారు. దోమ పోటు తగ్గేందుకు పొలాన్ని తరచు ఆర బెట్టాలని సూచించారు. నత్రజని ఎరువులను సిఫారసు మేరకే వేయాలనితెలిపారు. సింథటిక్ పైరిథ్రాయిడ్స్ మందులను వాడితే పురుగు ఉధృతి అధికమవుతుందన్నారు. తొలి దశలో ఎసిఫేట్ 1.5 గ్రా లేదా ఇథపెన్‌క్స, నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రెండో దఫాగా ఇమిడాక్లోప్రిడ్ ఎథిప్రోల్ 0.25 గ్రాములు లీటరు నీటికి కలిపి చేయాలని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఈఓ భాగ్యలక్ష్మి ఉన్నారు.

బీఆర్ఎస్‌కు మద్దతుగా టీబీజీకేఎస్ ప్రచారం

నవతెలంగాణ-రెబ్బెన

బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మీకి మద్దతుగా టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్ రావ్ ప్రచారం నిర్వహించారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లో ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయ్యాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల అనేక హక్కులు సాధించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కారుణ్య నియామకాలు ఆయనతోనే సాధ్యమైందన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అనేక సంక్షేమ పథకాల్లో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. సింగరేణి ఉద్యోగులకు, ప్రజలకు ఎన్నో హక్కులు సాధించిపెట్టారని, మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో గోలేటి గ్రామ సర్పంచ్ పోటు సుమలత, కడతల మల్లయ్య, బొంగు వెంకటేశం, సమ్మయ్య, మారిన వెంకటేశ్వర్లు, హనుమాండ్ల సత్యనారాయణ, మహేందర్, ఎస్.తిరుపతి పాల్గొన్నారు.

7న స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫ్లాగ్‌డే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఉన్న పాఠశాలల్లో నవంబర్ 7న ఫ్లాగ్‌డే నిర్వహించాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి వి.శ్యామ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో నిర్వహించిన స్కౌట్స్ అండ్ గైడ్స్ మాస్టర్స్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ల సంఖ్యను పెంచాలని సూచించారు. నమోదు రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. స్కౌట్స్ యూనిట్లు ఉన్న పాఠశాలల నుంచి గణతంత్ర వేడుకల్లో కెడెట్లు తప్పనిసరిగా పాల్గొనాలనేల చూడాలన్నారు. ప్రతి విద్యార్థి స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరేలా చూడాలన్నారు. అనంతరం ఫ్లాగ్‌డేకు సంబంధించి విద్యార్థులకు స్టిక్కర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి, శిక్షణ అధికారి శ్రీనివాస్, సహయ కార్యదర్శి స్వప్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్, స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని ఆసిఫాబాద్, బాబాపూర్, అంకుశాపూర్‌లలో గుడుంబా అమ్ముతున్నారని ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ అందిన సమాచారం దాడులు నిర్వహించారు. ఈ మేరకు అక్రమ మద్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు, బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ మోసిన్ అలీ తెలిపారు. దాడుల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు ఒక్కరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే తమకు తెలుపాలని సూచించారు. ఈ దాడుల్లో ఎస్ఐ విజయలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ ధర్మ ప్రకాష్, సిబ్బంది మహేష్, సురేష్, కిరణ్, దిలీప్ పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ డ్రామా కాంపిటేషన్‌లో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 2023-24ను ప్రభుత్వం మిల్లెట్ ఇయర్ ప్రకటించిన సందర్భంగా ఇచ్చిన అంశాలలో మిల్లెట్స్ మన ఆహారం అంశాన్ని తీసుకొని ప్రచార యుద్ధం అనే సైన్స్ నాటిక ప్రదర్శించి ముత్యంపల్లి విద్యార్థులు ఆకర్షించారు. ఈ నాటికలో ముత్యంపల్లి విద్యార్థులు అక్షయ, రమ, బిందు ప్రియ. సాగర్, నరేందర్, ఐశ్వర్య, అఖిల, వినయ్, లక్ష్మణ్ విద్యార్థులు పాల్గొని, ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 8న ఎస్ఈ ఆర్టీలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనున్నారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో కూడా ప్రథమ స్థానం సాధించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య, ఎంఈఓ వాసాల ప్రభాకర్ విద్యార్థులను, అభినందించారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర స్వామి, అభినందించారు.

దాడికి పాల్పడిన ఇన్‌చార్జీపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కాసిపేట

కళ్యాణి ఖని ఓపెన్ కాస్టు ప్రాజెక్టులో సోమవారం ఉదయం మైనింగ్ స్టాఫ్ సూపర్‌వైజర్‌పైన దాడి చేసిన ఆర్ఆర్ఆర్ ప్రయివేట్ కంపని ఇన్‌చార్జీ జగదీష్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఉదయం 11 గంటల సమయంలో దాడి సంఘటన జరిగిన వెంటనే ఏఐటీయూసీ నాయకులు స్పందించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోల్బెంచ్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఓవర్మెన్‌పై దాడికి రావడానికి కారణం అఫ్ లోడింగ్ ఇన్‌చార్జీ జగదీష్ సేఫ్టికి విరుద్ధంగా ఫైవ్ క్యూబిక్ మీటర్ షావెల్ వద్ద సెల్‌ఫోన్ ద్వారా వీడియోలు, ఫోటోలు తీయడాన్ని ఆపినందుకు బూతులు తిడుతూ కాలర్ పట్టుకొని కొట్టారని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఓసీలో ఐక్య పోరాటాలు చేపడుతామని, దీనికి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, మందమర్రి బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, కెకె ఓసీ ఫిట్ కార్యదర్శి మర్రి కుమార్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జ్ గోపతి సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపటి కేసీఆర్ పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 8న ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆశీర్వాద సభ పేరుతో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పర్యటనకు, బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రేమల గార్డెన్ పక్కన ఏర్పాటు చేయనున్న సభాస్థలిని ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 8న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కేంద్రంలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, సరస్వతి పాల్గొన్నారు.



నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎస్టీయూ ఆవిర్భావం

- రాష్ట్ర అధ్యక్షుడు సదానంద గౌడ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిజాం నిరంకుశ, నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ఏర్పాటైన సంఘమే ఎస్టీయూ అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సదానంద గౌడ్ అన్నారు. సోమవారం ఎస్టీయూ భవన్‌లో సంఘం జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు జాదవ్ అశోక్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎస్టీయూ నాటి హైదరాబాద్ రాష్ట్రంలో నిజాం నిరంకుశ, నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా ఆవిర్భవించిందన్నారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో 75 సంవత్సరాలుగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తూ ఎన్నో హక్కులు, సౌకర్యాలను సాధించామన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడుతున్న సంఘం ఎస్టీయూ అని అన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు త్వరలోనే రిలీవింగ్ ఉత్తర్వులు వెలువడతాయన్నారు. ప్రస్తుతం ఎన్నికల విధులలో పాల్గొనే ఉపాధ్యాయ, ఉద్యోగులకు పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పూర్వ అధ్యక్షులు చిలక విలాస్, హైదరాబాద్ హెడ్ క్వార్టర్ సెక్రటరీ పోల్‌రెడ్డి, ఏఐఎస్టీఎఫ్ నాయకులు పరమేశ, రాష్ట్ర నాయకులు లక్ష్మారెడ్డి, పుప్పాల నరేందర్, నూటెంకి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా జిల్లా కార్యవర్గం ఎన్నిక..

సంఘ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మూగ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా జాదవ్ అశోక్ కుమార్, ఆర్థిక కార్యదర్శిగా బనావత్ మనోహర్, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఎల్. దినేష్ చౌహాన్, బెజ్జంకి రవీంద్ర, శీతల్ చౌహాన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా జాదవ్ రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులుగా పి.కిషన్, శివప్రసాద్, జాదవ్ రవికుమార్, బత్తూరి సత్యనారాయణ, ఆడే జయశ్రీ, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శులుగా షేక్ మునీర్, మల్లేష్, జిల్లా కార్యదర్శులుగా స్వర్ణలత ఎస్ విశ్వనాథ్, పవార్ బాపురావు, ఎం.భూమేష్, ఆడే జవేందర్, ఆర్థిక కమిటీ సభ్యులుగా జాదవ్ గోవిందులను ఎన్నుకున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారు. ఎన్నికల అధికారిగా నిర్మల్ జిల్లా అధ్యక్షులు జుట్టు గజేందర్, ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు భూమన్న యాదవ్ వ్యవహరించారు.

నేడు పద్మల్‌పూరి కాకోకు ప్రత్యేక పూజలు

- వేలాదిగా తరలిరానున్న గిరిజనం

నవతెలంగాణ-దండేపల్లి

ఆదివాసీ గిరిజనుల ఆరాధ్య దైవం పద్మల్‌పురి కాకో దండారి వేడుకలు కాకో దక్షిణ భారత దేశంలోనే ఏకైక ఆదివాసీల ఆలయంగా ప్రసిద్ధిగాంచింది. దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి ఒడ్డున ఉన్న కాకో ఆలయంలో ఏటా దసరా తర్వాత వచ్చే ఆశ్వయుజ పౌర్ణమితో దండారి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దీపావళి అమావాస్యతో ముగుస్తాయి. పదిహేను రోజులు గుడిరేవు ప్రాంతం గిరిజనం గుస్సాడీ నృత్యాలతో అలరిస్తారు. జిల్లాతో పాటు నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, రాష్ట్రంలోని పలు జిల్లాలు, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి గిరిజనులు పెద్ద ఎత్తున ఈ ఆలయానికి తరలివస్తుంటారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున వచ్చి దర్శించుకుంటారు.

గిరి పుత్రుల ఆరాధ్యదైవం..

పద్మల్‌పురి కాకో ఆదివాసీ, గోండు, ప్రదాన్, కొలాం, తోటి గిరిజనులకు ఆరాధ్యదైవం. దసరా తర్వాత ఆలయం వద్ద జరిగే దండారి ఉత్సవాలకు ఆదివాసీలు కుటుంబ సమేతంగా వచ్చి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం విందు కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.



అలరించే గుస్సాడీ నృత్యాలు..

దండారి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా గుస్సాడి నృత్యాలు నిలుస్తాయి. ఈ నృత్యాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. సుదూర ప్రాంతాల నుంచి గిరిజనులు గుస్సాడీ వేషధారణలతో గ్రామాల నుంచి కాలినడకన ఆలయానికి చేరుకుంటారు. నెత్తిన నెమలి పింఛంతో తయారు చేసిన టోపీ, కళ్లద్దాలు, భుజాన జింక తోలు, నడుముకు, కాళ్లకు గజ్జెలు ధరించి, చేతిలో కోలా పట్టుకుని తప్పెట గూళ్ళ వాయిద్యాలు, డప్పు చప్పుళ్లకు గుస్సాడీలు చేసే నత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటాయి.

మూడు రోజులు రెండు నామినేషన్లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూర్ అసెంబ్లీ స్థానానికి సోమవారం ఒక నామినేషన్ దాఖలైనట్టు రిటర్నింగ్ అధికారి, జిల్లా అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. సిర్పూర్(టి) తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీష్ తరపున తన అనుచరులు సోమవారం ఒక సెట్ నామినేషన్ అందజేశారు. నామినేషన్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కాగా మూడు రోజుల్లో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిరోజు కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ తరపున ఆయన సతీమణి రావి సునీత నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందించారు. శనివారం ఒక్క నామినేషన్ కూడా రాలేదు. ఆదివారం సెలవు కావడం, సోమవారం ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఇప్పటి వరకు మొత్తం మూడు రోజుల ప్రక్రియలో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ గడువు ముగిసేలోపు ఆయా ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ అనుచరగణంతో నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాదిక్ పాషా, సిర్పూర్ (టి) ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ముగిసిన చేపల పెంపకం శిక్షణ

నవతెలంగాణ-తాండూర్

భారత మత్స్య అభివృద్ధి సంస్థ(ఎన్ఎఫ్‌డీబీ) సౌజన్యంతో బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఐదు రోజులుగా సాగుతున్న చేపల పెంపక శిక్షణ సోమవారం ముగిసింది. చేపల పెంపకం, విలువ ఆధారిత ఉత్పత్తులు శిక్షణ కార్యక్రమంలో 25 మంది రైతులు పాల్గొన్నారు. చివరి రోజు సోమవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం రిసోర్స్ పర్సన్ డా. గణేష్ కుమార్ శిక్షణ ఇచ్చారు. ఐదు రోజులు బోధించిన అంశాలపై రైతులకు పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన రైతులకు కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. శివకృష్ణ కోట చేతుల మీదుగా బహుమతులను అందించారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లను అందించారు.



బియ్యం జల్లెడ పడుతూ.. ఓటేయమని అడుగుతూ..

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం కొనసాగుతున్న తరుణంలో ప్రధాన పార్టీలు ప్రచారాలను మరింత ముమ్మరం చేస్తున్నాయి. ఓటర్లను కలుస్తూ తమదైన శైలిలో పార్టీకి మద్దతు తెలపాలని కోరుతున్నారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ అభ్యర్థి జోగు రామన్న తరపున మున్సిపల్ చైర్మెన్ జోగుప్రేమేందర్ పట్టణంలోని ఆయా కాలనీల్లో ప్రచారం చేపట్టారు. బియ్యం జల్లెడ పడుతూ కారు గుర్తుకు ఓటేయ్యాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గేడం సంజయ్, అశోక్ స్వామి, రామేశ్వర్, రాజు, మోబిన్, కొండ గణేష్, మిషు, గోవర్ధన్, అలోక్, మతిన్, జహుర్, ఇబ్బు పాల్గొన్నారు.

మహాగావ్‌లో వైద్య శిబిరం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మహాగావ్ గ్రామపంచాయతీలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. చలి కాలంలో శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా వస్తాయని గ్రామస్తులు జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యులు డా. రాంబాబు సూచించారు. ముందస్తుగా వ్యాధులను గుర్తించి సరైన సమయంలో చికిత్సలు అందించడంలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, సిబ్బంది ఈశ్వర్ నాయక్, జీజాబాయి ఉన్నారు.

9న జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 9న గుడిహత్నూర్ మండలం కేంద్రంలోని మోడల్ స్కూల్ ఆవరణలో జిల్లా స్థాయి అండర్-14, 17 సంవత్సరాల విభాగం బాలబాలికల హ్యాండ్ బాల్ ఎంపికపోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే విధంగా ఈ నెల 10న జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 17 సంవత్సరాల విభాగం బాలబాలికల జిల్లా స్థాయి షూటింగ్ బాల్ ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. అర్హత కలిగిన బాలబాలికలు సంబంధిత వయసు ధృవీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు పోటీల రిపోర్టు చేయాలన్నారు. ఇతర వివరాలకు హ్యాండ్ బాల్ ఆర్గనైజర్ వివేక్ సెల్: 6300807110, షూటింగ్ బాల్ ఆర్గనైజర్ ఎన్ హరిచరణ్ సెల్: 6300807110 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

11న మాదిగ విశ్వరూప మహాసభ

నవతెలంగాణ-జైనూర్

హైదరాబాద్‌లో 11న నిర్వహించే మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామగిరి రాము మాదిగ కోరారు. సోమవారం మండల కేంద్రంలో మహాసభ పోస్టర్లను నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలోని 59 ఉపకులాలను ఏబీసీడీలుగా విభజించాలని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ 29 ఏండ్లుగా పోరాటం చేస్తున్నారని గుర్తుచేశారు. విశ్వరూప మహాసభకు మండలాల వారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ అభ్యర్థి డిజిటల్ ప్రచారం

నవతెలంగాణ-దండేపల్లి

మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు సోమవారం డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో డిజిటల్ టీవీ ద్వారా తాను చేపట్టిన సహాయ కార్యక్రమాలను వీడియో రూపంలో రూపొందించి ప్రజల ముందుకు తీసుకొచ్చారు. మండల కేంద్రంలోని వారసంత వద్ద ప్రజలు ఆసక్తిగా తిలకరించారు.

సాలెగూడలో కుమురంభీం 83వ వర్ధంతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సాలెగూడ గ్రామంలో సోమవారం కుమురంభీం 33వ వర్ధంతిని ఆదివాసీ సాలెగూడ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు ఆదివాసీ సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఆదివాసుల కోసం కుమురంభీం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, మడావి అనంతరావు, సర్పంచ్ ఆడే జంగు, పెంద్రం హన్మంతు, నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు సిడం గణపతి, రాయిసెంటర్ అధ్యక్షుడు రాయిసిడం జంగు, ఉపమేడి కుమురం జనార్ధన్, వెడ్మ కిషన్, మడావి వెంకటేష్, పెంద్రం శంకర్, పెంద్రం ప్రభాకర్ పాల్గొన్నారు.